# బంగారు కంచం




పోలంరాజు శారద

# బంగారు కంచం

గేటు తెరుచుకొని లోపలికి ప్రవేశించాడు పోలీసు డ్రెస్సులో వున్న రాధాకృష్ణ.

తలుపు పక్కనే వున్న కాలింగ్ బెల్ నొక్కబోయి పక్కనే వున్న నేమ్ ప్లేట్ చూసి ఆగాడు. ప్రొ. కాత్యాయని, ఎం.ఎ., పిహెచ్.డి. ఆప్యాయంగా చేత్తో దాన్ని తడిమి బెల్ నొక్కాడు.

రెండు నిమిషాలకు తలుపు తెరుచుకున్నది. రాధాకృష్ణనే ముందర పలకరించాడు.

"ఏం బావగారూ గుర్తు పట్టలేదా? నేను రాధడిని."

"ఓ నువ్వా! పోలీసు డ్రెస్‌లో వుంటే ఒక్క క్షణం గుర్తుపట్టలేదు. రా లోపలికి." ఇద్దరూ లోపలికి నడిచారు.

"ఎవరండీ బెల్ కొట్టారు?" లోపలినుండి వచ్చింది మధ్య వయస్సులో వున్న కాత్యాయని "ఏరా రాధడు, ఏంటీ సరాసరి యూనిఫాంలోనే వచ్చేశావే?"

"ఇక్కడ ట్రైనింగ్ క్లాసులు జరుగుతున్నాయి. మధ్యలో టైం దొరికితే చూసి పోదామని వచ్చాను. ఏంటి సంగతులు? ఎట్లా వున్నారు? బావగారూ! ఏంటీ

అట్లాగే వుండిపోయారు. మీ తోటలు ఎట్లా వున్నాయి? కొత్త మొక్కలేమైనా వేశారా?"

"చాలా వేశాము. నువ్వు ఒక రోజు వుంటానంటే అన్నీ చూపిస్తాను."

"లేదు బావగారూ, ఈసారి కుదరదు. చాలా టైట్ షెడ్యూల్. ఈసారి తీరిగ్గా మీ చెల్లెలిని, పిల్లలను తీసుకొని వస్తాను. అప్పుడు అందరం సరదాగా వెళ్ళి చూసొద్దాం."

"ఏంట్రా సంగతులు. మీ ఆవిడా, పిల్లలు ఎట్లా వున్నారు? చాలా కాలమైంది వాళ్ళను చూసి. పిల్లలు బాగా చదువుకుంటున్నారా?" ఒక పక్క తయారవుతూనే కుశలప్రశ్నలు వేసింది.

తగ్గట్టే జవాబులు చెప్పాడు రాధాకృష్ణ. "నువ్వు కాలేజీకి బయలు దేరినట్టున్నావు."

"అవున్రా. అయినా ఇంకా టైం వుందిలే. కూర్చో. నిలబడే మాట్లాడు తున్నావే. కాఫీ తెస్తాను." లోపలికి వెళ్ళింది.

ఆమె భర్త మౌనంగా కూర్చొని వున్నాడు.

రాధాకృష్ణ గదంతా తేరిపార చూశాడు. చక్కగా అలకరించి వుంది. ఒక పక్క చిన్న టేబిల్ మీద నాలుగు పక్కల అద్దాలు బిగించి మధ్యలో ఒక స్టాండు మీద బంగారు పోత పోసిన కంచం నిలబెట్టి వుంది.

మురిపెంగా దాన్నే చూస్తూ అక్కడే నిలబడిపోయాడు.

"ఏంట్రా అట్లాగే నిలుచుండిపోయావు? ఇదిగో కాఫీ తీసుకో."

"ఏమిటక్కా! ఇంకా దీన్ని ఎదురుగా పెట్టుకొని వుంచావా?" అద్దాల షోకేసును ఆప్యాయంగా చేత్తో తడుముతూ అడిగాడు రాధడు.

నవ్వేసి వూరుకున్నది కాత్యాయని. "నేను కాలేజీకి వెళ్ళుతున్నాను. నువ్వు, బావగారు భోంచేసేయండి."

"లేదక్కయ్యా! నేను మీటింగుకు వచ్చాను. అక్కడే మా భోజనాలు. కాస్సేపు కూర్చొని వెళ్ళిపోతాను."

కాత్యాయని వెళ్ళిం తరువాత రాధడు బావగారిని పలకరించటానికి ప్రయత్నించాడు. ఆయన ముక్తసరిగా అవునూ, కాదూ అంటూ జవాబులు

చెప్పటం తప్ప ఎక్కువగా మాట్లాడలేదు. కాస్సేపు కూర్చొని రాధదు వెళ్ళిపోయాడు.

కాత్యాయని భర్త లేచి ఆ మూలనున్న స్టాండ్ దగ్గర నిలబడ్డాడు. కళ్ళ ముందర గతం మెదిలింది. ఎక్కడి అబల ఆనాటి కాచి? ఎక్కడ ఈనాటి డాక్టర్ కాత్యాయని? ఈ పరిణామంలో ఎవరి పాత్ర ఎంత? తానే ఆనాడు ధైర్యం చేసి కాచికి అండగా నిలిచివుంటే ఈనాడు ఆమె ఈ స్థితిలో వుండగలిగేదా! అందరు పల్లెటూరి ఆడవాళ్ళలాగా తాను కూడా పిడకలు చరుచుకుంటూ వుండిపోయేది. జరిగింది అన్యాయమైనా తాను కూడా పరోక్షంగా ఆమె అభివృద్ధికి కారకుడైనాడు.

శివరావుకు పాతికేళ్ళ క్రితం జరిగిన సంఘటనలు కళ్ళ ముందు కదలాడాయి.

❄ ❄ ❄

తల్లితండ్రుల మొదటి సంతానం కాత్యాయని. రంగు తక్కువైనా పెద్ద పెద్ద కళ్ళతో కళకళ్లాడుతూ ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా వుంటుంది. సాంప్రదాయమైన కుటుంబం. తల్లి, తండ్రి, నాయనమ్మ సుందరమ్మ వారి కుటుంబసభ్యులు. తండ్రికి గవర్నమెంటు వుద్యోగం. పెద్దది కాకపోయినా పరువుగా కుటుంబం నడపగలిగే సంపాదన. కాత్యాయని పుట్టగానే తండ్రి ముందు చూపుతో నెలకింత అని పొదుపు చేసేవాడు.

కాత్యాయినికి, పెద్ద తమ్ముడికి మధ్య మూడేళ్ళ అంతరం. తరువాత ఏడాదికే రెండో తమ్ముడు పుట్టాడు. చిన్నతనం నుంచే కాచి తమ్ముళ్ళ ఆలనా పాలనా చూసేది. మడీ, ఆచారంగల కుటుంబం. ఇంటిపనులతో తల్లి రాజమ్మ సతమత మవుతుంటే అర్థం చేసుకొని తన వయసుకు తగ్గట్టు చిన్న చిన్న పనులు చేసేది.

నాయనమ్మకు మాత్రం కాచి అంటే నిరసన. తొలిచూలు ఆడపిల్ల అన్న కారణం అయి వుండవచ్చు. బారసాలనాడు తన పేరు పెట్టకుండా ఆ సంవత్సరమే మరణించిన కోడలి తల్లి పేరు పెట్టినందువల్లో కాని మనుమరాలిని ఎప్పుడూ ఆప్యాయంగా దగ్గరకు తీసిన సందర్భాలే లేవు.

కాచికి పదకొండేళ్ళు నిండి పన్నెండేళ్ళు వచ్చాయో లేదో నాయనమ్మ పోరు మొదలయ్యింది.

“ఒరేయ్ రాఘవా! పిల్లకు పదకొండేళ్ళు నిండాయి. అయినా మీ మొగుడూ పెళ్ళాలు అసలు దాని పెళ్ళిగురించి ఆలోచించారా? అదేమో గుర్రమాలే ఎదుగు

తున్నది. రేపో మాపో పెద్దమనిషై కూర్చుంటే నలుగురూ నన్ను పెద్దదానివి నువ్వేం చేస్తున్నావు అంటారు. తొందరగా ఏదో సంబంధం చూసి గుండెల మీద కుంపటి దింపే మార్గం చూడండి.”

“అయినా అమ్మా! నీ చాదస్తం కాని ఈ రోజుల్లో అవన్ని ఎవరు పట్టించుకుంటున్నారు. అందరు ఆడపిల్లలూ చదువుకుంటున్నారు. కాచిని కూడా చదువుకోనియ్యి” అని కొట్టి పారేయబోయాడు.

కాని తల్లి వూరుకోలేదు. చెవిని ఇల్లు కట్టుకొని పోరటం మొదలెట్టింది. కూర్చోనివ్వలేదు, నించోనివ్వలేదు. భోజనానికి కూర్చుంటే పక్కనే చేరి అదే విషయం. ఇంక తల్లి తనను వదలదని తెలిసి ఇంక తప్పనిసరిగా పెళ్ళి విషయం ఆలోచించసాగాడు. పక్క వూళ్ళో ఒక సంబంధం వున్నదని తెలిసి తల్లి శతపోరటం మొదలెట్టింది. ఇంక తప్పదని వెళ్ళి విచారించాడు.

పెళ్ళికొడుకు శివరావు, వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు తమ్ముళ్ళను చదివిస్తున్నాడు. తండ్రి లేదు.

చదువు లేని పిల్లవాడా అని తటపటాయించాడు.

“చాల్లేరా! చదువు వుండి ఉద్ధరించేది ఏముంది? నీలాగా గుమాస్తా బతుకేగా! ఏదో పొలం వుంటే, ఆ వ్యవసాయం, ఆ హోదాలో వున్న దర్జా నీకేం తెలుసు?”

తల్లికి తను వుద్యోగం చేయటం మొదటినుండి ఇష్టం లేదు. పొలాలు లేక పోయినా, ఎవరి దగ్గరనైనా కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకున్నా గౌరవం అనుకొనే రకం.

ఈ విధంగా సంభాషణ జరుగుతున్న సమయంలో వచ్చాడు నాలుగు వీధుల అవతల వుంటున్న కాత్యాయని మేనమామ శ్రీనివాస శర్మ. వయసులోనే కాదు అన్నిటా పెద్దే. ఆ వూరికంతటికీ పేరు మోసిన వకీలు. తిమ్మిని బ్రహ్మిని చేసి, మోకాలికి, బోడితలలకు ముడి వేసి బాగానే సంపాదించాడు. ఎంతటివాళ్ళనూ లెక్కచేయడు. ఎంత మాట నోటికొస్తే అంత మాటా అనేస్తాడు. ఆయన పిల్లలంతా బాగా చదువుకొని పెళ్ళిళ్ళు చేసుకొని స్థిరపడ్డారు.

అడపా తడపా చెల్లెలి ఇంటికి వెళ్ళి వాళ్ళ మంచిచెడులు కనుక్కోవటం, అవసరమైతే అండదండగా విలబడటం అలవాటు.

ఆ రోజు అతను వచ్చేటప్పటికి అందరూ మొహాలు వేళ్ళాడేసుకొని కూర్చున్నారు. పెద్దావిడ అపర కాళి అవతారంతో కొడుకును, కోడలిని తూర్పార బడుతున్నది. కాత్యాయని తమ్ముళ్ళను కూర్చోపెట్టుకొని అక్షరాలు దిద్దిస్తున్నది.

ఆ వకీలు బుర్రకు ఎక్కడైనా తగాదా వుంటే మహదానందం. సమస్య తీర్చి తీర్పు ఇచ్చే అవకాశం దొరికిందని వుత్సాహం. అది వూరివారిదైనా ఫరవాలేదు, స్వంత చెల్లెలిదైతే ఇంకా మంచిది.

“ఏం బావా, ఏంటీ పరిస్థితి చాలా వేడిగా వున్నట్టున్నది? ఏం అత్తయ్యా! కొడుకూ, కోడలూ మాట వినటల్లేదా? బెత్తం పుచ్చుకోవటమే తరువాయిగా వున్నట్టున్నది.” జోక్ చేసాననుకొని పెద్దగా నవ్వి, చెల్లెలు ఇచ్చిన మంచినీళ్ళు తాగి వుయ్యాలబల్ల మీద బాసింపట్టు వేసుకొని ఇంక కేసు విచారణకు వచ్చిన జడ్జిలాగా కూర్చున్నాడు.

ఇంట్లో జరుగుతున్న కాత్యాయని పెళ్ళి చర్చ అతనికి చెప్పితే ఏదైనా పరిష్కారం దొరుకుతుందేమోనన్న ఆశ పొడచూపింది.

“ఏం లేదు బావా, కాచికి పెళ్ళి సంబంధం...”

“నిండా పన్నెండేళ్ళు లేవు. అప్పుడే దాని పెళ్ళికేం తొందరొచ్చింది? ఏం అమ్మాయ్! నువ్వు కూడా మీ ఆయనకు వంత పాడుతున్నావా? దాన్ని చదువుకో నీయండి” ఆయన కూతుళ్ళిద్దరూ డిగ్రీ దాకా చదివిం తరువాతే పెళ్ళి చేసాడు.

“ఏం మాట్లాడుతున్నావు అల్లుడూ! ఇంత వయసు వచ్చేదాకా ఆడపిల్లను వుంచటం మా ఇంటా వంటా లేదు మాది సాంప్రదాయ కుటుంబం” సుందరమ్మ అందుకున్నది. “ఏదో పరువుగా బతుకుతున్న మధ్యతరగతివాళ్ళం. పిల్లను అంతంత చదువులు చదివించి, అంతంత కట్నాలు పోసి పెళ్ళిళ్ళు చేయటానికి మాకేమీ కలెక్టర్ గిరీలు, వకీలు గిరీలు లేవు”

‘అమ్మో! ఏదో సుడి నామీదకే తిరిగింది. ఈ ముసలావిడ దగ్గర తన దర్పం పనికిరాదు. నాకన్నా మించిన లా పాయింట్లు తీస్తుంది. అయినా తనకెందుకు?’ అనుకున్నాడు.

“అవునులే అత్తయ్యా! నువ్వు చెప్పింది కూడా నిజమే. మీ స్తోమతుకు తగ్గ సంబంధాలు చూడాలంటే ఆడపిల్లకు చదువులు అక్కరలేదు. సరే బావా! ఇంతకూ ఏదైనా సంబంధం తటస్థపడిందా?”

"పక్క వూరిలో ఒక కుర్రాడు వున్నాడు. తండ్రి లేడు ఇద్దరు చదువుకుంటున్న తమ్ముళ్ళు వున్నారు. ఆ పిల్లవాడు స్కూల్‌ఫైనల్‌తో చదువాపేసి పొలం పనులు చూసుకుంటున్నాడు."

"ఇంక సందేహమెందుకు? కనుక్కోలేకపోయావా?"

"మరీ చదువులేని వ్యవసాయదారుడని..."

"ఇదయ్యా వరస. చదువెందుకు? ఏదో నీలాగా వకీలు చదివి రెండు చేతులా సంపాదిస్తే ఫరవాలేదు. కాని ఇదిగో వీడిలాగా గుమాస్తాగిరికి పనికి వచ్చే చదువు వుండి ఎంత, లేక ఎంత? ఆ డిగ్రీలు వుండి ఏం వుపయోగం? దానిబదులు పది గొడ్లను పెంచుకుంటే పాలో పెరుగో..." ఏకధాటిగా తన వాదన వినిపించింది.

ఈ పరిస్థితి చూస్తే ముసలమ్మ మాటే నెగ్గేటట్టు వున్నది. ఆమెను కాదని తను మాత్రం చెడ్డ అనిపించుకోవటమెందుకు? అయినా అంత సులభంగా లొంగకూడదు అనుకున్నాడు.

"అమ్మాయీ! నీ అభిప్రాయమేమిటమ్మా?"

"నాకేం తెలుసన్నయ్యా? పెద్దవాళ్ళు మీరంతా ఏమంటే నేనూ అదే. అత్తయ్య, మీ బావా, నువ్వూ కలిసి ఆలోచించండి."

"అయ్యో రాత! అడక్కడక్క దాన్నే అడిగావ్! మీ చెల్లెలి తెలివితేటలు, దొడ్లో వున్న బర్రెగొడ్డు తెలివితేటలు రెండూ రెండే. అస్తమాను ఆ పిల్లలు, వంటగది, గొడ్లచావిడి తప్ప దానికి ఏ ప్రపంచం తెలుసని?" తనేదో మహా ప్రపంచాన్ని చుట్టపెట్టిన వీరవనితలాగ ఒక చిన్న వుపన్యాసం దంచింది.

ఇంక అక్కడ ఆవిడ మాట తప్ప ఇంక ఎవరిమాట నెగ్గదని బాగా అర్థమైంది.

"అయితే ఇంక ఆలస్యమెందుకు? వాళ్ళ ఇంటికి వెళ్ళి ఒక మంచిరోజు చూసుకొని అమ్మాయిని చూసుకోటానికి రమ్మందాం. అన్నీ సక్రమంగా నడుస్తే వచ్చే నెలలో ముహూర్తాలు వున్నాయి. అది తప్పుతే తరువాత గురు మౌఢ్యమి శుక్ర మౌఢ్యమి వస్తాయి." కండువా దులుపుకొని తన తీర్పు ఇచ్చి లేవబోయాడు.

అప్పటికి సుందరమ్మ మొహం వికసించింది. "మా మంచి మాట

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Bangaru+Kancham**

* * *